క్లుప్తంగా

దైవ భక్తితో పాటు దేశ భక్తిని కలిగి ఉండాలి

ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ హేమశంకర్రావు



నగరం: దైవ భక్తితో పాటు దేశభక్తిని కలిగి ఉండాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకర్రావు అన్నారు. నగరంలోని శ్రీమత్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భరతమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హేమ శంకర్రావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావనతో పాటు దేశ భక్తిని పెంపొందించేందుకే సమరసత సేవా ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. 26వ తేదీ వరకు భరతమాతకు పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బయ్యన వెంకట్రావు, రేపల్లె డివిజన్ ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ పాల్గొన్నారు.

మినీ గోకులంతో రైతులకు మేలు



భట్టిప్రోలు (కొల్లూరు): ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న గోకులాలతో రైతాంగానికి మేలు చేకూరుతుందని ఎంపీడీఓ ఎస్.వెంకట రమణ అన్నారు. సోమవారం మండలంలోని ఆళ్లమూడిలో రూ.2.30 లక్షలతో చేబ్రోలు సునీత గృహం వద్ద నిర్మించిన మినీ గోకులాన్ని ఆయన స్థానిక సర్పంచి పెద్దిశెట్టి రాంబాబుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్ఆర్జీఎస్ నిధులు సద్వినియోగం చేసుకొని ఇటువంటి నిర్మాణాలు చేపట్టడం వలన ప్రజలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఉషారాణి, ఏపీఓ శివపార్వతి, పంచాయతీ కార్యదర్శి పి.ప్రదీప్‌కుమార్, టీఏ సుధీర్, ఫీల్డ్ అసిస్టెంట్ రత్నకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాంప్‌లో టీఎం రావు పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



భట్టిప్రోలు (కొల్లూరు) : ఎన్‌సీసీ క్యాంప్‌లో నిర్వహించిన పలు పోటీలలో టీఎం రావు పాఠశాల విద్యార్థినులు ప్రతిభా పాటవాలు ప్రదర్శించడంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కేతనకొండలో ఇటీవల పదిరోజుల పాటు నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంప్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీలలో 9వ తరగతి విద్యార్థిని సయ్యద్ మునీరా, పాటల పోటీలలో నందం జాహ్నవిలకు మొదటి స్థానం లభించింది. ఎన్‌సీసీ క్యాంప్‌లో రాణించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పులికొండ మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయుడు సి.రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించి ధ్రువపత్రాలు, మెడల్స్ అందజేశారు.

తైక్వాండో పోటీల్లో ఫాతిమాకు రజత పతకం



తెనాలిఅర్బన్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌కు చెందిన ఆరోవ తరగతి విద్యార్థిని షేక్ సనా ఫాతిమా అండర్ -12 బాలికల విభాగంలో ద్వితీయ స్థానంతో పాటు రజత పతకం సాధించినట్లు స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ తెలిపారు. తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రేపల్లెలోని ఈ నెల 11,12 తేదీలలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థిని అభినందించి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి జూదరులను అరెస్ట్ చేశారు. తెనాలి మండలం అంగలకుదురు పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్, సిబ్బంది సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తెనాలి పట్టణం, అంగలకుదురు, దుండిపాలెం గ్రామాలకు చెందిన ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 1.02 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

మినుము సాగుకు రైతుల ఆసక్తి

- జొన్న, మొక్కజొన్నకు పెట్టుబడి ఎక్కువ కావడంతో మినుములో పల్లాకు తెగులు బెడద
- నివారణకు వేలాది రూపాయలు ఖర్చు



అమర్తలూరు మండల కేంద్రంలో పల్లాకు తెగులు వ్యాపించిన మినుము పంట

వేమూరు: నియోజకవర్గంలోని అమర్తలూరు మండలంలో డెల్టా ప్రాంతంలో కొన్ని సంవత్సరాల క్రితం రైతులు మినుము, పెసర పంటలు ఎక్కువగా సాగు చేసేవారు. మినుము పంటలో పల్లాకు తెగులు వ్యాపించడంతో పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. రైతులు పూర్తిగా నష్టపోవడం జరిగింది. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలైన జొన్న, మొక్కజొన్న సాగు వైపు మొగ్గు చూపారు.

- అయితే జొన్న, మొక్కజొన్న పంటల సాగులో ఖర్చు ఎక్కువ కావడం.. దిగుబడి తక్కువ రావడం అలాగే వాటిలో కూడా తెగుళ్లు వ్యాపించడం, సాగుకు నీరు కూడా ఎక్కువ మొత్తంలో అవసరం కావడం వంటి కారణాలతో రైతులు మరలా రబీ పంటలైన మినుము, పెసర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు.

పెట్టుబడి తక్కువ

వేమూరు నియోజకవర్గం అమర్తలూరు మండలంలో రైతులు రబీ పంటలో మినుము పంట సాగు చేశారు. పెట్టుబడి తక్కువ అలాగే నీరు కూడా ఎక్కువ అవసరం లేకపోవడంతో రైతులు మరలా మినుము పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మినుము పంట 10 వేల ఎకరాల్లో సాగు చేశారు. 7 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 3 వేల ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు.

కాగా మినుము పంటలో పల్లాకు తెగులు ఎక్కువ కావడంతో నివారణకు రైతులు మందులు పిచికారీ చేస్తున్నామని చెబుతున్నారు. మినుము పంటకు మరలా పల్లాకు తెగులు సోకడంతో నివారణకు రైతులు అధిక సంఖ్యలో ఖర్చు చేసి పురుగు మందులు పిచికారీ చేస్తున్నా ప్రయోజనం ఉండటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ పెట్టుబడి తక్కువ కావడంతో మినుము సాగుకే మొగ్గు చూపుతున్నారు.

నివారణ కావడం లేదు

అమర్తలూరు మండల కేంద్రంలో మూడు ఎకరాల్లో మినుము పంట సాగు చేశాను. మినుములో పల్లాకు తెగులు సోకడంతో నివారణకు అనేక మందులు పిచికారీ చేస్తున్నాను, నివారణ కావడం లేదు.



– అమర్తలూరు వెంకయ్య, రైతు, అమర్తలూరు

20 ఎకరాల్లో సాగు చేశాను

అమర్తలూరు మండలంలోని బోడపాడు గ్రామంలో 20 ఎకరాల్లో మినుము పంట సాగు చేశాను. మినుము పంటకు పల్లాకు తెగులు వ్యాపించడంతో నివారణకు మందులు పిచికారీ చేసిన నివారణ కావడం లేదు.



– గేరా ప్రతాప్, బోడపాడు గ్రామం, అమర్తలూరు మండలం

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



కూచినపూడిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నిజాంపట్నం: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ నాగార్జున కోరారు. జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా మండలంలోని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం కుష్ఠు వ్యాధిపై నిర్వహించిన అవగాహనా ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కుష్ఠు వ్యాధి మైకో బ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియాతో వస్తుందన్నారు. తుమ్ము, దగ్గుతో క్రిములు వ్యాప్తి చెందుతాయన్నారు. వ్యాధి లక్షణాలు తెలిసేందుకు కనీసం 3 నుంచి 5 సంవత్సరాల కాలం పట్టవచ్చన్నారు. శరీరంపై స్పర్శలేని రాగివర్ణ మచ్చలు, రంగు మారిన మచ్చలు, పొడలు, లావుగా మారిన నరాలు, నొప్పులతో కూడిన నరాలు, కాళ్లు, చేతుల కండరాలలో బలహీనత, చేతులు, పాదాలు, నరాలలో తిమ్మిర్లు, కళ్లు పూర్తిగా మూసుకోలేకపోవటం, చెవి తమ్మెలు మందంగా మారటం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆయా లక్షణాలు కనిపించితే వెంటనే వైద్యశాలలో సంప్రదించి చికిత్స పొందాలని చెప్పారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాలలో పర్యటిస్తూ వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించటంతో పాటు వ్యాధిగ్రస్తులు ఎవరైనా ఉంటే వెంటనే చికిత్స పొందే విధంగా చైతన్యపరచాలన్నారు. చికిత్సలను ఉచితంగా పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రణవి, సూపర్‌వైజర్లు మురళీ, సాంబశివరావు, మాధవి, పీహెచ్ఎన్ లక్ష్మి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగు నీటి సరఫరా సక్రమంగా జరగాలి

ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని

చెరుకుపల్లి: గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీరు సక్రమంగా సరఫరా చెయ్యాలన్నారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో తాగు నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని తెలిపారు. ఈఓపీఆర్డీ కేజీఏ శ్రీనివాసన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మండల పంచాయతీ విస్తరణాధికారి మృతి



నరసింహారావు

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండల పరిషత్ కార్యాలయంలోని మండల పంచాయతీ విస్తరణాధికారి జి.నరసింహారావు గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గుంటూరులో పలకలూరు రోడ్డ వద్ద ఇంటిలో సోమవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. ఆయన అమర్తలూరు మండల పంచాయతీ విస్తరణాధికారి, రేపల్లె డివిజనల్ పంచాయతీ ఇన్‌చార్జి అధికారిగా పని చేస్తున్నారు. మాజీ మంత్రి, శాసన సభ్యులు నక్కా ఆనందబాబు పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది నివాళులర్పించారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి



బాపట్ల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ మురారీధర్ నాయక్

జంపని(వేమూరు): మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు తగు చర్యలు తీసుకోవాలని బాపట్ల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మురారీధర్ నాయక్ తెలిపారు. మండలం జంపని రెవెన్యూ గ్రామంలోని బూతుమల్లి గ్రామంలో మొక్కజొన్న పంటను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు నీమ్ ఆయిల్ 5 మి.లీ, నీటికి కలిపి చేయ్యాలి, స్పినోసాడ్ 0.3 మి.లీ, నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పేనుబంక నివారణకు మెథోడేమెషన్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సస్యరక్షణతో మంచి ఫలితాలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి అక్తర్ హుస్సేన్, మండల వ్యవసాయాధికారి చందోలు సునీత, జంపని గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

12వ వార్డులో రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించండి

తెనాలిఅర్బన్: 12వ వార్డులోని పలు వీధుల్లో రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించాలని స్థానికులు కోరారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. 30వ వార్డులోని మున్సిపల్ స్థలంలో కూరగాయల సాగును నిలిపివేయాలని, 32వ వార్డులో ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని, గాంధీచౌక్‌లోని వీఎస్సార్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న అక్రమ కట్టడాలను ఆపివేయాలని, 30వ వార్డులో మురుగు కాల్వల పూడికతీత పనులు చేపట్టాలని పలువురు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు వినతిపత్రం అందజేశారు. వీటన్నింటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మిపతి, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అక్షరాస్యులను చేయాలి



కర్లపాలెం: నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి అక్షరాస్యులను చేయాలని తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఉల్లాస్(వయోజన విద్య) వలంటీర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీవో మాట్లాడుతూ మహిళలు చదువుకున్నప్పుడే సమాజంపై అవగాహన కలిగి ఉంటారని అన్నారు. ఆర్థికంగా అభివృద్ధి సాధించటానికి చదువు తోడ్పడుతుందన్నారు. చదువుకున్న మహిళలు చట్టాలను త్వరగా అర్థం చేసుకోగలుగుతారని చెప్పారు. సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలో పదవ తరగతి చదువుకున్న మహిళలను గుర్తించి వారిని వలంటీర్లుగా నియమించినట్లు తెలిపారు. ఒక్కొక్క వలంటీర్ నిరక్షరాస్యులైన పది మంది మహిళలకు చదువు చెప్పాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విజయశ్రీ, వయోజన విద్య సూపర్‌వైజర్ శివరాంప్రసాద్, హెచ్ఎం విజయభాస్కర్‌రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి, సీసీలు రాఘవులు శివకోటేశ్వరరావు, ఉల్లాస్ వలంటీర్లు పాల్గొన్నారు.

22 నుంచి ప్రత్యేక సదరమ్ క్యాంప్‌లు

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తెనాలి జిల్లా వైద్యశాలలో ఈ నెల 22 నుంచి 24 వరకు ప్రత్యేక సదరమ్ క్యాంప్‌లను నిర్వహించనున్నట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు. ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రతినెల వీటిని నిర్వహించే అవకాశం ఉందన్నారు. గతంలో సదరమ్ సర్టిఫికెట్ పొందిన ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన సమయంలో వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

పూరిల్లు దగ్ధం



మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

భట్టిప్రోలు (కొల్లూరు) : అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పల్లెకోనలో లుక్కా నాగరాజుకు చెందిన గృహం నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించడంతో కుటుంబ సభ్యులు ప్రాణాలను దక్కించుకునేందుకు కట్టుబట్టలతో బయటపడ్డారు. మంటల తీవ్రత అధికమై ఇల్లు మొత్తం చుట్టుముట్టడంతో గృహం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. స్థానికులు మంటలను అదుపు చేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. స్థానికుల సమాచారంతో రేపల్లె నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుండా అదుపులోకి తీసుకువచ్చారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించిందని, ప్రమాదం కారణంగా సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటి పన్నులు త్వరగా చెల్లించండి

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని ఇంటి, ఖాళీ స్థలం, నీటి కుళాయి పనులను త్వరగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ బిల్డర్ కాట్రగడ్డ వెంకటేశ్వరరావు రూ.4.10 లక్షలు, గడ్డిపాటి శివరామకృష్ణ రూ.2.34 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. పెద్ద మొత్తంలో చెల్లించాల్సిన వారు తమకు తెలియజేస్తే సిబ్బందిని వారి వద్దకు పంపుతామని చెప్పారు.

రోడ్లపై చెత్త లేకుండా చూడండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: రోడ్లపై చెత్తలేకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 21,22 వార్డులలో సోమవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వలు అధ్వాన్నంగా ఉండటాన్ని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. ప్రతి రోజు కాల్వలు శుభ్రం చేయాలని సూచించారు. అలాగే ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆమె వెంట 22వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, టీపీవో సాంబశివరావు, ఏఈ సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



తెనాలిఅర్బన్: పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని ఓ దుకాణదారుడు తన షాపు ముందు అక్రమంగా ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ను సోమవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సీటీ ప్లానర్ మాట్లాడుతూ మురుగు కాల్వలపై ఎటువంటి గ్రిల్స్, ఫ్లోరింగ్‌ను ఏర్పాటు చేయవద్దని సూచించారు. మున్సిపల్ స్థలంలో ఏర్పాటు చేసే ప్రతి ఆక్రమణను తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. టీపీవో సాంబశివరావు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను వ్యతిరేకించింది వైఎస్సార్‌సీపీ

పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



రేపల్లె రూరల్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తొలి నుంచి వ్యతిరేకించింది వైఎస్సార్‌సీపీ అని రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ఎప్పుడు కట్టుబడి ఉంటుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్లు ప్యాకేజీ కేటాయించిందని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవటం హాస్యాస్పదంగా ఉందని, ప్రైవేటీకరణ అంశాన్ని ఉపసంహరించుకుంటున్నామని కేంద్రం నేటికీ ప్రకటించలేదన్నారు. కూటమిలో భాగస్వాములుగా ఉన్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు ఈ అంశంపై ప్రధానమంత్రిపై ఒత్తిడి తీసుకురావటంలో తీవ్రంగా విఫలం చెందుతున్నారన్నారు. ఇటీవల విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కనీసం నోరు మెదపలేదని, అదే వేదికపై ఉన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు తమ స్వప్రయోజనాల కోసం స్టీల్ ప్లాంట్ అంశాన్ని లేవనెత్తలేదన్నారు. టీడీపీ, జనసేన నాయకులకు సొంత ప్రయోజనాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవన్నారు. నష్టాలలో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను అధిక ధరకు విక్రయించి ప్రైవేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించిందని ప్రజా సంఘాలు, రాజకీయవేత్తలు అనుమానం వ్యక్తం చేస్తున్నారని, ఇప్పటికైనా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయకుండా కూటమి పాలకులు చిత్తశుద్ధితో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కార వేదికకు 13 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె రూరల్: ప్రజలు తమ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. వృద్ధుల సంక్షేమానికై ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు అర్జీ అందించారన్నారు. హోటల్ నుంచి తమ ఇంటిపై బూడిద పడుతోందని పట్టణానికి చెందిన పుష్పవతి, అదే విధంగా 3వ వార్డులోని విజయదుర్గ రైస్ మిల్ నుంచి వెలువడుతున్న నల్లని మసితో 60 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, పరిష్కరించాలని వార్డుకు చెందిన రామాయణం దుర్గాప్రసాద్ వినతి పత్రం అందజేశారన్నారు. పెనుమూడి నుంచి గుడ్డికాయలంక అక్విడక్ట్ వరకు మురుగు కాల్వ వ్యర్థాలతో నిండి ఉందని, పరిష్కరించాలని చదలవాడ శివరామకృష్ణ, అలాగే పాన్‌బ్రోకర్స్ లైసెన్స్ రెన్యువల్ చేయాలని కోట వీర వెంకట హనుమంతరావు గుప్త అర్జీలు అందించారన్నారు. తన స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని దామెర్ల శ్రీనివాసరావు, తనపై వచ్చిన అభియోగాలపై తప్పుడు నివేదిక తయారు చేసిన మత్స్య శాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని నల్లూరు నార్త్‌కు చెందిన కృష్ణ ఫిర్యాదు చేశారన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని తాళ్ళతిప్పకు చెందిన దామెర్ల శ్రీనివాసరావు అర్జీ ఇచ్చారన్నారు. నగరం మండలం సజ్జావారిపాలెంలో నిబంధనల ప్రకారం ఎస్సీ కేటగిరీ వెరిఫికేషన్‌ను జరిపించాలని ఒక అర్జీ అందగా భూమి సర్వేకై 4 అర్జీలు అందాయన్నారు. పరిష్కార వేదికలో అందిన 13 అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులచే పరిష్కరించబడునన్నారు.

వరికూటికి అభినందనల వెల్లువ



వరికూటిని కలసి అభినందనలు తెలిపిన భట్టిప్రోలు మండల నాయకులు, కార్యకర్తలు

భట్టిప్రోలు (కొల్లూరు) : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించబడిన వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరికూటి అశోక్‌బాబును రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ అధికారికంగా ప్రకటించడంపై పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతుంది. సోమవారం భట్టిప్రోలు మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వరికూటిని కలసి అభినందనలు తెలియజేశారు. మండలంలోని పెసర్లంకకు చెందిన హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ నేషనల్ వైస్ చైర్మన్ యన్నం సురేష్ అశోక్‌బాబును ఆయన గృహంలో కలసి పూలమాలలు, బొకేలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ తోడుగా ఉండే అశోక్‌బాబు లాంటి నాయకుడిని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించడం వల్ల పార్టీని బలోపేతం చేయడంలో అశోక్‌బాబు శక్తివంచన లేకుండా పాటుపడతారని ఈ సందర్భంగా నాయకులు వ్యాఖ్యానించారు. వరికూటిని కలసి అభినందనలు తెలిపిన వారిలో పల్లెకోన, రాచూరు సర్పంచ్‌లు బొల్లెద్దు ప్రతాప్, రాధాకృష్ణ, గుజ్జర్లమూడి రాజు, రెబ్బా యారన్, కట్టుపల్లి కిశోర్, కనపర్తి నాగరాజు, శొంఠి సాయి, కనపర్తి దేవేంద్ర, పంతగాని ప్రవీణ్, పంతగాని బాలు, కనపర్తి వీరబాబు, యన్నం కార్తీక్ తదితరులు ఉన్నారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన పశు వైద్యులు రేచల్ దివ్య

కర్లపాలెం: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కర్లపాలెం మండల పశు వైద్యాధికారి రేచల్ దివ్య తెలిపారు. చింతాయపాలెంలో సోమవారం పశు వైద్య శిబిరాల గోడ ప్రతులను రేచల్ దివ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సోమవారం చింతాయపాలెం, పేరలి గ్రామాలలో పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పశువులలో వచ్చే వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించామన్నారు. పశువులకు వచ్చే గర్భకోశ, సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతాయపాలెం సర్పంచ్ పి.శ్రీనివాసరావు, పశు వైద్య సిబ్బంది పాండురంగారావు, రాజేష్, రహ్మతున్నీసా, గోపాలమిత్రలు తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల నిరసన

తెనాలి రూరల్: తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించి తెనాలి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పొన్నూరు టౌన్ సి.ఐ, ఎస్.ఐ లని తీరును ఖండిస్తూ వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పొన్నూరు పోలీస్ స్టేషన్‌లో ఒక సీనియర్ న్యాయవాది బేతాళ ప్రకాశరావుని నిర్బంధించి విచక్షణ రహితంగా కొట్టడడమేకాక అతనిపై తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేసినందుకు నిరసిస్తూ గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కోర్టు విధులను బహిష్కరించి తెనాలి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై పోలీసుల దాడి అమానుషమని అన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన పోలీసులు న్యాయం కోసం పోరాడే న్యాయవాదులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. న్యాయవాదులపై గౌరవం లేకుండా పోలీసులు విచక్షణ రహితంగా, బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తూ ఈ ఘటనకు కారణమైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సిబ్బందిని వెంటనే విధుల నుంచి తొలగించాలని న్యాయవాదికి న్యాయం చేయాలని, తక్షణమే వారిని అరెస్టు చేయాలంటూ డిమాండ్ చేశారు. అంతేకాక దీనిపై సమగ్ర విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బేతాళ ప్రభాకర్, హరిదాసు గౌరీ శంకర్, అప్పల కిషోర్, అబ్దుల్ ఆరిఫ్, కంచర్ల కోటేశ్వరరావు, రెడ్డి వెంకటేశ్వరరావు, నాగళ్ళ హరీష్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.